


# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,13 సెప్టెంబర్ 2025

8 పేజీలు


## 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

# రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యత





- అధికారుల ప్రాంతీయ సమావేశంలో మంత్రి నాదెండ్ల
- రైతులు నుంచి మద్దతు ధరకే ధాన్యం సేకరణ
- 48 గంటల లోపే సేకరణ సొమ్ములు చెల్లింపు
- గత ఖరీఫ్‌లో రూ.12,557 కోట్ల ధాన్యం కొనుగోలు

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లో రాష్ట్రం లో రైతుల నుండి 50 లక్షలు మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యం చేపట్టామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

శుక్రవారం కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ హాలులో మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్, విసి ఎండి డా. మనజీర్ జిలాని సమూన్ లతో కలిసి పూర్వ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని కాకినాడ,డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు, సివిల్ సప్లయిస్ కార్పోరేషన్‌డియంలు, డిఎస్‌ఓలు,వ్యవసాయ,రెవెన్యూ,సహకార, మార్కెటింగ్, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులతో ప్రాంతీయ సమావేశం నిర్వహించి 2025-26 ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రణాళికపై చర్చించి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకు గత యేడాది ఖరీఫ్ సీజను సేకరణలో తీసుకున్న మంచి ప్రణాళికలు చేపట్టామని, రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటలలోపే చెల్లింపులు చేపట్టామని, గత ఖరీఫ్, రబీ సీజన్లలో 7.67 లక్షల మంది రైతుల నుండి 12,557 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. అంతేకాక గత ప్రభుత్వం రైతులకు బకాయిపెట్టి

- తరువాయి 2లో..

## నేడు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న కీర్తి చేకూరి



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా కొత్త కలెక్టర్‌గా ఐఏఎస్ అధికారి కీర్తిచేకూరి నియమితులయ్యారు. ప్రస్తుతం ఏపీ ట్రాన్స్కోలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కీర్తి చేకూరిని రాష్ట్ర ప్రభుత్వం గురువారం తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయడం జరిగింది. విశాఖపట్నం స్వస్థలమైన కీర్తి చేకూరి ఐఐటి మద్రాస్‌లో ఉన్నత విద్య పూర్తి చేశారు.ఆమె మూడు సార్లు

- తరువాయి 2లో..

## ఎస్కెవీటీ కళాశాల అభివృద్ధికి కృషి

-ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

-రూ. 65 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం



- మిగతా 2 లో..

## బీసీల రక్షణ చట్టం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం..



- గీత ఉప కులాల కోసం మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదు
- కులాల మధ్య చిచ్చుపెట్టే విష సంస్కృతి వైసీపీదే
- వైసీపీ ఒక విషపు వృక్షం.. పేటీఎం బ్యాచ్‌తో ప్రజలు అప్రమత్తం
- మీడియా సమావేశంలో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్య బ్యూరో :** బీసీల రక్షణ చట్టం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని,అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, విషప్రచారాలను చేయడంలో వైసీపీ విష వృక్షంగా తయారైందని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి

- తరువాయి 2లో..

## సముద్రపు అలల ఉధృతికి గురవుతున్న గ్రామాలకు రక్షణ కల్పించేందుకు తక్షణ,దీర్ఘకాలిక చర్యలు

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**యు.కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** గత నాలుగు రోజులుగా ఉప్పాడ కొత్తపల్లి మండలం సుబ్బంపేట గ్రామంలో సముద్రపు అలల తీవ్రత పెరిగి, గ్రామంలోకి నీరుచేరిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్..ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఉప్పాడ శివారు సుబ్బంపేట గ్రామాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

- తరువాయి 2లో..

## మామిడి తాండ్రపై జీఎస్టీ తగ్గింపు హర్షణీయం

- కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఇటీవల జరిగిన 56వ జీఎస్టి కౌన్సిల్ సమావేశంలో ఫ్రూట్ జెల్లీలపై జీఎస్టీని భారీగా తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్‌లో మామిడి తాండ్ర పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఫ్రూట్ జెల్లీపై విధిస్తున్న 12శాతం జీఎస్టీ మామిడి తాండ్ర పరిశ్రమకు భారంగా మారిందన్నారు. ఏపీలో ముఖ్యంగా కాకినాడ పరిసరప్రాంతాల్లో మామిడి తాండ్ర తయారీ ఎంతో ప్రసిద్ధి చెందిందని, 400 కోట్ల

- తరువాయి 2లో..

# బీసీల రక్షణ చట్టం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**మొదటిపేజి తరువాయి**

వాసంశెట్టి సుభాష్ ఎద్దేవా చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని శెట్టిబలిజ సామాజికవర్గాన్ని ఓసిల్లో చేరుస్తున్నారంటూ వైసీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రి ఖండించారు. కులాల మధ్య చిచ్చు రేపుతూ జగ్గిరెడ్డి అవగాహన రాహిత్యంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. వైసీపీ జిల్లా అధ్యకుడిగా ఉన్న వ్యక్తికి కనీస అవగాహన లేకుండా మాట్లాడడం శోచనీయమన్నారు. శెట్టిబలిజల గురించి మాట్లాడే నైతిక అర్హత వైసీపీ నాయకులకు లేదని సుభాష్ స్పష్టం చేశారు. బిసిల రక్షణకోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందన్నారు. బీసీల రక్షణ చట్టంపై ఇప్పటికే పలుమార్లు బిసి మంత్రులు, శాసనసభ్యులతో సమావేశం నిర్వహించామన్నారు. స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన వైసీపీ నేడు బీసీల పట్ల మొసలీ కన్నీరు కారుస్తోందన్నారు. బీసీలకు అగ్రతాంబూలం ఇచ్చిన పార్టీ తెలుగుదేశమని, బార్లు, వైన్ షాపుల్లో శెట్టిబలిజలకు 10% అవకాశం కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సూపర్ సిక్స్ బంపర్ హిట్ కావడంతో వైసీపీ నాయకులకు దిమ్మతిరిగి అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. యూరియాపై కూడ రైతుల్లో అనవసరం భయాందోళనలు కల్పించే దుష్ప్రచారానికి వైసీపీ తెర తీసిందని మంత్రి సుభాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనదక్షత వల్ల రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా చేశారన్నారు. రాష్ట్రంలో యూరియా కొరత ఉందనడం పూర్తిగా అవాస్తవమన్నారు. కేవలం రైతులను భయాందోళనలకు గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే వైసీపీ విష ప్రచారానికి తెరలేపిందని సుభాష్ వెల్లడించారు. జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఏటా సగటున 5 లక్షల టన్నుల యూరియా మాత్రమే రైతులకు అందించారని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ఖరీఫ్ సీజన్‌లో 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులోకి తెచ్చామని ఆయన వివరించారు. ఇప్పటికే ఆగస్టు నెలాఖరు నాటికి 5,69,712 టన్నులు, ఈ నెలలో మరో 94,482 టన్నులు సరఫరా చేశారని తెలిపారు. వాస్తవాలు తెలియకుండా వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు కథనాలతో కృత్రిమ కొరతను సృష్టించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. గత ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని జగన్ రెడ్డి పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను అడ్డుకునేందుకే వైసీపీ తప్పుడు ప్రచారాలు, డ్రామాలకు తెరలేపింది, ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్నారు. రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలిపే విషయమై మంత్రి స్పందిస్తూ ప్రజాభిప్రాయాన్ని స్వీకరించి అధిష్టానానికి తీసుకెళ్తానన్నారు. బీసీల ఉన్నతి కోసం ప్రవేశపెట్టిన ఆదరణ పథకాన్ని గత వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని తిరిగి రూ.1000 కోట్లతో పునరుద్ధరించామన్నారు. బీసీలను అన్ని రంగాల్లో రాజకీయంగా సామాజికంగా, ఆర్థికంగా అణగతొక్కి ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. అలాగే గత వైసిపి కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేసిందని విమర్శించారు. డూప్లికేషన్ పేరుతో కార్మికులకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు అందకుండా చేసిందన్నారు. కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అన్ని జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటుకు కృషి చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కుడిపూడి సత్తిబాబు, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌కెవీటీ కళాశాల అభివృద్ధికి కృషి

**-ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**-రూ. 65 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్** : ప్రసిద్ధ కందుకూరి వీరేశలింగం పంతులు వారి డిగ్రీ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కెవీటీ డిగ్రీ కళాశాల ఆవరణలోని మేజర్ డ్రైనేజీపై ఐరన్ షట్టర్లు ఏర్పాటు చేసే నిమిత్తం రూ. 65 లక్షలతో చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎస్‌కెవీటీ కళాశాల ఆవరణలో నగర పాలక సంస్థ గతంలో నిర్మించిన ఈ మేజర్ డ్రైనేజీ కారణంగా దానికి ఆనుకుని ఉన్న నివాసాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దానిపై ఎటువంటి క్లోజింగ్ సర్ఫ్యాట్స్ లేని కారణంగా దాని నుంచి వచ్చే దుర్వాసన స్థానిక ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉందని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ డ్రైనేజీపై ఇప్పటికే ఫ్యాబ్రికేషన్ పనులు చేయడం జరిగిందని, దుర్వాసన రాకుండా పూర్తిగా కప్పబడే విధంగా జి ఐ షీట్ ఏర్పాటు చేసేందుకు రూ.65 లక్షలతో పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. జీ ఐ షీట్ అనేది శాశ్వత పరిష్కారం కాదని, సిల్టు తీసుకునే విధంగా పూర్తిగా కాంక్రీట్ స్ట్రక్చర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల సమయానికి శాశ్వత పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నగరంలో ఎక్కడికక్కడ ప్రజలకు అవసరమైన పనులు చేయడం జరుగుతోందన్నారు. నగరంలో నిత్యం శానిటేషన్ నిర్వహణ చేపట్టేలా... అలాగే డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు సిల్టు తీసేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కేవలం ప్రజలకు ఉపయోగపడే పనులపైనే తమ కూటమి ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టిన వెంటనే నగరంలోని రోడ్లపై ప్రతి చిన్న గుంతను పూడ్చే కార్యక్రమాన్ని త్వరలోనే చేపట్టడం జరుగుతుందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

# 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యత

**మొదటిపేజి తరువాయి**

వెళ్లిన రూ.1674 కోట్ల మొత్తాన్ని కూడా కూటమి ప్రభుత్వం రైతులకు చెల్లించిందన్నారు. రబీలో స్థానిక సమస్యల కారణంగా చిన్నచిన్న సమస్యలు ఏదురైయ్యాయని, అవి 2025-26 ఖరీఫ్ ధాన్యం సేకరణలో గోనె సంచులు, రవాణా వాహనాల పరంగా ఇబ్బందులు పునరావృతం కాకుండా అధికారులు ముందస్తు కార్యాచరణతో సంసిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఈ యేడాది ఖరీఫ్ పంటలు ముందే అక్టోబరు రెండవ వారానికే కోతకు వస్తున్నందున అన్ని జిల్లాలో ధాన్యం మార్కెట్ కు వచ్చేందుకు నాలుగైదు రోజుల ముందే సేకరణ కేంద్రాలను ప్రారంభించాలని, ఇందుకు సిబ్బందికి అవసరమైన పిపిసి కేంద్రాల సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలను సెప్టెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని 1234 రైతు సేవా కేంద్రాలను, 691 రైసు మిల్లులను అనుసంధానం చేసి సేకరణ ప్రక్రియను రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సమాయత్తం కావాలన్నారు. గత ఖరీఫ్ సీజనలో రాష్ట్రంలో 35.94 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ చేసామని, అధిక దిగుబడుల అంచనా, కేంద్రం జారీచేసిన అదనపు కేటాయింపులతో 2025-26 ఖరీఫ్ సీజనులో రాష్ట్ర చరిత్రలో తొలిసారి అత్యధికంగా 50 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించేందుకు లక్ష్యం చేపట్టామన్నారు. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమగోదావరి జిల్లాలో 5 లక్షలు, బిఆర్ఏ కోనసీమ జిల్లాలో 3.50 లక్షలు, కాకినాడ జిల్లాలో 3 లక్షలు, ఏలూరు జిల్లాలో 4 లక్షలు వెరసి 19.50 లక్షల మెట్రిక్ టన్నులు ఉమ్మడి గోదావరి జిల్లాలోనే సేకరణ జరగనుందని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం వరి సాధారణ రకాలకు 2,369 రూపాయలు, ఏ గ్రేడ్ రకాలకు 2389 రూపాయలకు పెంచి మద్దతు ధరలను ప్రకటించిందన్నారు. రాష్ట్రంలో రైతులను నుండి కొనుగోలు చేసిన ఫైన్ రకాల ధాన్యాన్ని 41 వేల పాఠశాలలు, 4 వేల సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల భోజన పథకానికి బియ్యంగా సరఫరా చేస్తున్నామని, ఈ ఖరీఫ్ సీజనులో రైతుల నుండి ఫైన్ రకాల ధాన్యం సేకరకణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి మిల్లర్ల నుండి బ్యాంకు గ్యారెంటీలను ఆన్‌లైన్ ద్వారా సేకరించాలని మంత్రి తెలిపారు.సమావేశంలో తొలుత పౌర సరఫరాల సంస్థ విసి ఎండి డా. మనజీర్ జిలాని సమూన్ ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత సమర్ధవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంస్థ రూపొందించిన ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఆన్‌లైన్ పోర్టల్ గురించి అధికారులకు వివరించారు. ఈ పోర్టల్‌లో రైతు సేవా కేంద్రాలు, సిబ్బంది, కొనుగోళ్లు చెల్లింపులు, వాహనాలు, వెబ్‌సైట్లు, మాయిశ్చర్ మీటర్లు, గోనెసంచులూ, మిల్లులు ఫీడ్ బ్యాక్ తదితర సమాచారాన్ని పొందుపరచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డా. బి.ఆర్. అంబేత్కర్-కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, తూర్పు గోదావరి జిల్లా డియం గణేశ్ కుమార్, ఏలూరు జిల్ల్ డియం పి.ఎస్.ఆర్. మూర్తి, ఆయా జిల్లాలలో 2025-26 ఖరీఫ్ ధాన్యం సేకరణకు చేపట్టిన చర్యలను మంత్రికి వివరించారు.

## నేడు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న కీర్తి చేకూరి

**మొదటిపేజి తరువాయి**

యూపీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి,మొదటిసారి 440ర్యాంక్,రెండోసారి 512 ర్యాంక్, మూడోసారి అత్యుత్తమ 14వ ర్యాంక్‌తో2016లో IASగా నియామకం అయ్యారు.వృత్తిపరమైన క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథం కలిగిన అధికారిణిగా పేరు పొందిన ఆమె, తొలిసారిగా చిత్తూరు జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్, తదుపరి మదనపల్లెలో సబ్ కలెక్టర్, ఉమ్మడి తూర్పు గోదావరిలో జాయింట్ కలెక్టర్‌గా పనిచేశారు. అనంతరం గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్‌గా, ప్రస్తుతం "ఏపీ ట్రాన్స్ కో"లో జాయింట్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, పారదర్శకతతో విధులు నిర్వర్తించే అధికారిణిగా మంచి పేరు సంపాదించుకున్న కీర్తి చేకూరి సెప్టెంబర్ 13 వ తేదీ శనివారం తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## మామిడి తాండ్రపై జీఎస్టీ తగ్గింపు హర్షణీయం

**మొదటిపేజి తరువాయి**

వార్షిక టర్నోవర్ కలిగిన ఈ పరిశ్రమపై ఆధారపడి 15 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తుండగా, ఇందులో అధిక శాతం గ్రామీణ మహిళలు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో మామిడి తాండ్రపై జీఎస్టీ భారాన్ని తగ్గించి తమను ఆదుకోవాలని పరిశ్రమల నిర్వాహకులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు విన్నవించుకోవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశాలతో మామిడి తాండ్ర పరిశ్రమలను స్వయంగా పరిశీలించి, పరిశ్రమ ఎదుర్కొంటున్న కష్టాలపై పలుమార్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను వ్యక్తిగతంగా కలిసి జీఎస్టీ భారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేయడంతోపాటు ఈ ఏడాది ఫిబ్రవరి, ఆగస్టులో లేఖలు రాయడం జరిగిందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం ఫ్రూట్ జెల్లీపై జీఎస్టీని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించిందని తెలిపారు. జీఎస్టీ తగ్గింపుతో చిన్నస్థాయి మామిడి తాండ్ర పరిశ్రమలకు ఉపశమనం కలగడంతో పాటు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ రంగంపై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తారని తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. జీఎస్టీ భారాన్ని తగ్గిస్తూ సానుకూల నిర్ణయం తీసుకున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

## సముద్రపు అలల ఉధృతికి గురవుతున్న గ్రామాలకు రక్షణ కల్పించేందుకు తక్షణ,దీర్ఘకాలిక చర్యలు

**మొదటిపేజి తరువాయి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామస్తులకు తాత్కాలిక సహాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామంలో నిలిచిపోయిన నీటిని బయటకు పంపేందుకు ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారని, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు తక్షణ పరిష్కారాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఆయన తెలిపారు. అలల తీవ్రతకు దెబ్బతిన్న ప్రస్తుత రక్షణ గోడలోని రాళ్లను యుద్ధప్రాతిపదికన తిరిగి ఏర్పాటు చేయడంతో పాటు, అదనంగా కొత్త రాళ్లను వేసి గోడ ఎత్తును పెంచడం ద్వారా అలల ప్రభావాన్ని సమర్ధవంతంగా తగ్గించవచ్చునన్నారు. సుబ్బంపేట సహా తీర ప్రాంత గ్రామాలకు శాశ్వత రక్షణ కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో రూ.323 కోట్లతో పటిష్టమైన రిటైనర్ వాల్ (రక్షణ గోడ) నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయబడ్డాయనన్నారు. ఈ రక్షణ గోడ నిర్మాణం పూర్తయితే, సుమారు 30-40 సంవత్సరాల పాటు తీర ప్రాంత గ్రామాలకు పూర్తి రక్షణ లభిస్తుందనన్నారు. సుమారు 10 కిలోమీటర్ల మేర తీరం పొడవునా అలల ఉధృతి ఉన్నప్పటికీ, ప్రస్తుతం సుబ్బంపేట గ్రామం ఎక్కువగా ప్రభావితమైందని, మాయాపట్నం వద్ద పరిస్థితిని కూడా పరిశీలించామని..గతంలోనూ ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ఈ అలల ఉదృతికి కారణమైన సాంకేతిక అంశాలను సమీక్షించి, యుద్ధప్రాతిపదికన పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించినట్లు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తెలిపారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లి బాబు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, డీపీవో వి.రవికుమార్, ఏడి కరుణాకర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జీవన శైలి మార్పుతో మోకాళ్ళ నొప్పులకు వైద్య చికిత్స - డాక్టర్ నెక్కంటి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన ఆహారం, వ్యాయామం మరియు జీవనశైలి మార్పులతో కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగుపరుచు కోవడానికి ఎక్కువ అవకాశం ఉందని ఎం.ఎన్. ప్రిసిషన్ క్లినిక్ అధినేత డాక్టర్ మాధవ్ నెక్కంటి అన్నారు.

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశం శుక్రవారం సాయంత్రం క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మోకాళ్ళ నొప్పులు–వైద్యం అనే అంశంపై డాక్టర్ మాధవ్ నెక్కంటి విశ్లేషణాత్మకమైన ప్రసంగాన్ని చేస్తూ అనేక వైద్య సూచనలను అందించారు. మోకాళ్ళకు బలాన్ని ఇచ్చే వ్యాయామము ముఖ్యంగా కండరాలను బలోపేతం చేసే విధంగా ఉండడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. నీటిలో చేసే వ్యాయామము, నడక వంటివి కీళ్లపై ఒత్తిడిని తగ్గించి వాటి కదలికలను మెరుగుపరుస్తాయి అన్నారు. మోకాళ్లపై అధిక పరువు పడటం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని దానికి వైద్యుల సలహా తీసుకోవడం ద్వారా ఆ సమస్య నుండి ఎదుర్కొనేందుకు ఎక్కువ వీలుంటుంది అన్నారు. బరువు నియంత్రించే చర్యలు వైద్యుల సూచనలతో చేపట్టడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని డాక్టర్ మాధవ్ నెక్కంటి అన్నారు .మోకాళ్ళ సమస్యకు కారణాన్ని తెలుసుకోవడానికి అత్యాధుక వైద్య విధానం అందుబాటులోకి వచ్చిందని వైద్యు డి నిసంప్రదించడం ద్వారా ఆ సమస్య నుండి అధికమించేందుకు ఆస్కారం ఉందని అన్నారు. మోకాళ్ళ నొప్పులను అశ్రద్ధ చేయడం ద్వారా భవిష్యత్తులో నడక మాట ఎలా ఉన్నా కూర్చోవడానికి కూడా ఎంతో కష్టపడాల్సి వస్తుందని ఆయన వివరించారు .వంశపారంపర్యంగా వచ్చే లక్షణాలు కూడా ఈ వ్యాధిలో గుర్తించడం జరిగిందన్నారు. మందుల వాడకంతో సమస్య పరిష్కారం కానీ ఎడల ఇంజక్షన్ మరియు శస్త్ర చికిత్స ద్వారా నయం చేసే అవకాశం ఉందని ఆ విధానం వైద్యుల సిఫారసుతో మాత్రమే చేయాల్సి ఉంటుందన్నారు. మోకాళ్ళ అరుగుదల గురించి తెలుసుకొని వాటికి ప్రత్యామ్నాయాన్ని వైద్యుల సూచనలతో చేపట్టిన తక్కువ సమయంలోనే ట్రీట్మెంట్ అందించడానికి ఎంతో వీలుంటుంది అన్నారు. వయస్సు మరియు జెనెటిక్స్ ద్వారా కూడా ఈ వ్యాధి వచ్చేందుకు అవకాశం ఉందని, ఊబకాయం కూడా ప్రధాన కారణమని డాక్టర్ మాధవ్ నెక్కంటి అన్నారు. ఈ అంశంపై ప్రత్యేక క్లినిక్ ను నిర్వహిస్తున్నామని ప్రజలు ఈ సమస్యను వివరించి పరిష్కారం పొందవచ్చని డాక్టర్ మాధవ్ నెక్కంటి అన్నారు. (సెల్ నెంబర్ 96664 57777) సమస్య చిన్నదిగా కనిపించినప్పటికీ వాటి ప్రభావం మొత్తం దేహంతో పాటు జీవన విధానంపై కూడా ఉంటుందని డాక్టర్ నెక్కంటి మాధవ చెప్పారు. ఇటువంటి అంశాలపై రోటరీ వంటి అంతర్జాతీయ సంస్థ సదస్సులు నిర్వహించడం ప్రజా ఆరోగ్య పట్ల ఉన్న అంకిత భావాన్ని చాటుతోందని డాక్టర్ మాధవ్ అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, కోశాధికారి ఉదయ చక్రవర్తి వేదికపై ఆసీనులయ్యారు. అనంతరం డాక్టర్ మాధవ్ నెక్కంటిని ఘనంగా సత్కరించారు. సభ్యులు అడిగిన సందేహాలకు విశ్లేషణాత్మకమైన వివరణను డాక్టర్ మాధవ్ ఇచ్చారు. కార్యక్రమంలో ముంజులూరి విశ్వేశ్వరరావు, లంక సాయిబాబు, హరిహత్తకుమార్, మాజేటి పవన్, టేకుమూడు సూర్యనారాయణ, సత్తి రవి రెడ్డి, వై.ఉమామహేశ్వరరావు, కే.శ్రీధర్, ఎం.రవీంద్రనాథ్, రెడ్డి కుమార్, చిరంజీవి రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు.

# తాడిపూడిలో పేకాట శిబిరంపై దాడి- 4 అరెస్ట్ రూ.3,420 స్వాధీనం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని తాడిపూడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ ఎస్.రాము వారి సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి 4 గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.3,420 నగదు స్వాధీనం చేసుకుని వారిపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో పేకాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.




# మత్స్యకారులకు మెరుగైన జీవన ఉపాధి, ఆర్థిక సుస్థిరతకు చర్యలు

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మత్స్యకారుల యొక్క జీవనోపాధి మెరుగుపరిచి వారికి సుస్థిరమైన ఆధాయం కల్పించే లక్ష్యంతో ఏలేశ్వరం జలాశయంలో ఉచితంగా చేప పిల్లల విడుదల కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయంలో చేపల విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ హాజరై ఏలేరు జలాశయంలోకి చాప పిల్లలను విడిచిపెట్టారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం జలాశయాల్లో చేప పిల్లలకు విడిచిపెట్టే కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. నేడు ఏలేరు జలాశయానికి సంబంధించి జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో వేట్లపాలెం మత్స్య విత్తన కేంద్రంలో అభివృద్ధి పరచిన 10లక్షల మేలు రకం చేప పిల్లలను ఉచితంగా విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ చేప పిల్లల విడుదల కార్యక్రమం ద్వారా ఏలేరు రిజర్వాయర్ అనుకొని ఉన్న సుమారు 550 మత్స్య కారుల కుటుంబాలకు ప్రత్యక్షంగా జీవనోపాధి లభిస్తుందన్నారు. అదేవిధంగా 5,936 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న రిజర్వాయర్ చుట్టుపక్కల గల ఐదు మండలాల పరిధిలోని ప్రజలకు ఆరోగ్యకరమైన, నాణ్యమైన, రుచికరమైన చేపలు లభిస్తున్నాయని ఆయన తెలిపారు. మత్స్యకారుల యొక్క జీవనోపాధి మెరుగుపరిచి వారికి సుస్థిరమైన ఆధాయం కల్పించే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సదుపాయాలు, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. వీటన్నిటిని సద్వినియోగం చేసుకుని మత్సకారుల ఆర్థికంగా బలపడాలని ఆయన సూచించారు. మత్స్యకారులకు రాయితీలపై ద్విచక్ర వాహనాలు, బోట్లు, జీపీఎస్ పరికరాలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మత్స్యకారుల జీవనోపాధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం ఏలేరు జలాశయంలో మేలు రకం చేప పిల్లలను ఉచితంగా విడుదల చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. కాకినాడ జిల్లాలో అర్హులైన మత్స్యకారులందరకు మత్స్యకారుల సేవా పథకం కింద వేట నిషేధ కాలంలో నిషేధ భృతిని రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అందించడం జరిగిందన్నారు. మత్స్యకారులు ఆర్థిక ప్రమాణాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ఇతర పథకాల ద్వారా 40 శాతం రాయితీపై మత్స్యకారులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం నిమిత్తం చేపట్టిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏలేరు జలాశయం ఛైర్మన్ బస్సా వీరబాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. కృష్ణారావు, ఏడి ఎం.లావణ్య, ఎమ్పీడీవోలు రామకృష్ణ, నూకరాజు, రాజేంద్ర రావు, ఉమామహేశ్వరరావు ఇతర ప్రజాప్రతి నిధులు, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

# భయం గుప్పెట్లో మత్స్యకార కుటుంబాలు

**– గత రెండు రోజులుగా ఉప్పాడ తీరంపై విరుచుకుపడుతున్న భారీ అలలు**

**– స్కూళ్లో, గుళ్ళు , ఇళ్లు నీటిమయం**



**యు.కొత్తపల్లి,మేజర్‌న్యూస్ :** రాకాసి అలలు తాకిడికి మాయాపట్నం, రంగంపేట, సుబ్బంపేట గ్రామాలు కకావికలం అవుతున్నాయి. గ్రామాలపై విరుచుకు పడుతున్న అలలతో స్కూల్లోకి, ఇళ్లలోకి సముద్రపు నీరు చేరుతోంది. గ్రామాల్లోకి చేరిన నీటిని సముద్రంలోకి సిబ్బంది మళ్ళిస్తున్నారు. ఉప్పాడ తీర ప్రాంతంలో శు క్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ పర్యటించారు. కలెక్టర్ షాన్ మోహన్‌పై భారీ అలలు విరుచుకుపడటంతో అధికారులు తడిసి ముద్దయ్యారు. తమకు తక్షణం ఇళ్ల స్థలాలు ఇప్పించాలంటూ మత్స్యకార మహిళలు కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. రక్షణ గోడ నిర్మాణానికి ముందే అతి త్వరలో పెద్ద పెద్ద రాళ్లతో తాత్కాలిక రక్షణ గోడ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

**– ఎటపాక సీడీపీఓ అరుణ**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని ఎటపాక చిల్డ్రన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.అరుణ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలో గల ఎంపీడీవో కార్యాల యం వద్ద గల ఎంపీడీవో మీటింగ్ హాల్ నందు ఎటపాక తహసీల్దార్ కారం సుబ్బారావు, ఎటపాక ఎంపీడీవో ప్రేమ్ సాగర్, వెలుగు ఏపిఎం రావి భాస్కర్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి నోడల్ అధికారిగా అరుణ బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సమావేశం లో బాల్యవివాహాల నిర్మూలనకు సంబంధించి పలు అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎటపాక సిడిపిఓ పి.అరుణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అందుకు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆమె తెలిపారు. 18ఏళ్లు నిండిన అమ్మాయికి, 21 ఏళ్లు ఉన్న అబ్బాయికి వివాహం చేయాలని, చిన్న వయసులో వివాహం చేయడం వల్ల అమ్మాయిలకు ఆరోగ్య సమస్యలు, పుట్టే పిల్లలకు పౌష్టికాహార లోపంతో ఉంటారన్నారు. చిన్నప్పుడే వివాహం చేయడం వల్ల చదువు ఆగిపోతుందని, దానివల్ల భవిష్యత్ పాడై, వారికి ఆర్థిక ఇబ్బందులు వస్తాయని ఆమె అన్నారు.మీ చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో ఎవ్వరైన బాల్య వివాహాలు జరిపిస్తున్నట్లయితే సంబంధించిన అధికారు లకు కానీ, పోలీస్ శాఖ అధికారులకు కానీ శిశు సంక్షేమశాఖకు కానీ తెలియపరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఫోక్సో కేసు నమోదు చేయడం జరుగుతుంది అని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు సమష్టిగా కృషి చేసి బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుబడి పనిచేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ టీ.పావని, రాధా, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులకు సన్మానం

**– ప్రజా సమస్యల పరిష్కారమ్ లో నిరంతర సేవలు**



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** కొత్తపల్లి మండల సీనియర్ పాత్రికేయులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు శుక్రవా రం ఘనంగా సన్మానిం చారు. వాసవి క్లబ్ ఫౌండర్ కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతి వారోత్స వాలు పురస్కరించుకొని మూడు దశాబ్దాలు పైబడి జర్నలిజంలో పనిచేస్తున్న మచ్చి కంటి మూర్తి, వెలుగుల ప్రసాద్, చోడిశెట్టి సురేష్ లను ఉప్పాడలో ఘనంగా సన్మానించారు. మండల సమస్యలను ఎండగట్టడంలో ఈ ముగ్గురు పాత్రికేయులు కీలక పాత్ర వహిం చారని వాసవి క్లబ్ సభ్యులు కొనియాడారు. అధికారులకు, ప్రజల మధ్య వారధిగా ఉంటూ కీలకమైన సమస్యలను ప్రచురిం చడంలో వీరి ముగ్గురు పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం ఉప్పాడ నంబర్ వన్ పాఠశాల వికలాంగ విద్యార్థులకు టవల్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వాసవి క్లబ్ అధ్యక్షుడు దంగేటి దత్తాత్రేయ, సెక్రటరీ చెన్న విటల్ బాబు, ట్రెజరర్ కూరగాయల వెంకటరాజు, ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు కూరగాయల రఘు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## 'పోలవరం' పునరావాసం నిధులు దుర్వినియోగంపై 'సిబిసిఐడి' విచారణకు డిమాండ్



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దేవీపట్నం మండలంలో కోట్ల రూపాయల పోలవరం ప్యాకేజీ దండుకొన్న వారిపై క్రిమినల్ కేసులు వేయాలని, ప్రభుత్వ ధనం దుర్వినియోగంపై సిబిసిఐడితో విచారణ జరపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డిమాండ్ చేసింది. శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ బృందం దేవీపట్నం మండలంలో పర్యటించి ఇందుకూరు గ్రామంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ నిర్వాసితులు నుండి పలు సమస్యలు తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ దేవీపట్నం మండలంలో నాన్ ట్రైబల్స్‌కు, అవినీతి అధికారులకు పోలవరం ప్రాజెక్టు వరంగా, ఆదివాసులకు శాపంగా మారిందన్నారు. అసలైన ఆదివాసీ నిర్వాసితులకు ల్యాండ్ టు ల్యాండ్, నష్ట పరిహారం చెల్లించాలని, కానీ దాదాపు పది సంవత్సరాలు పైనుండి అధికారులు చుట్టూ, కార్యాలయం చుట్టూ తిరుగుతూ అలసిపోయారని, కానీ ప్రభుత్వ భూములు, కొంతమంది ఆదివాసీ భూములు కబ్జా చేసిన నాన్ ట్రైబల్స్ మాత్రమే గుట్టు చప్పుడు కాకుండా కోట్ల రూపాయలు పరిహారాన్ని దోచుకున్నారని ఆరోపణ చేసారు. దీనికి గతంలో పనిచేసిన చాలామంది రెవిన్యూ అధికారులు కమిషన్ కోసం కక్కుర్తి పడి ప్రభుత్వ ధనాన్ని ఎటువంటి అర్హత లేని నాన్ ట్రైబల్స్‌కు దోచిపెట్టారని ఆయన ఆరోపించారు. కాగా ఆదివాసీలు 2013 భూ సేకరణ అవార్డు జరిగిన అప్పటినుండి వారికి జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని అధికారులు చుట్టూ నేటికీ తిరుగుతున్నా వారి సమస్యలు పరిష్కారం కాలేదని, ఎందుకంటే వారు అధికారులకు కమిషన్ ఇచ్చే పరిస్థితిలో లేరు కాబట్టి వారికి పనులు జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఎమ్మార్వోను కలిస్తే విఆర్వోకు అప్పజెప్పితే వీఆర్వోలు సర్వేయర్లకు చెప్పాలని, మళ్లీ సర్వేయర్లు వీఆర్వోలు దగ్గరకెళ్లాలని వీఆర్వోలు మాకు సంబంధం లేదని ఇలా తప్పించుకుంటూ కాలయాపన చేశారన్నారు. ఇలా ఆదివాసులు తమ సమస్యలు పరిష్కారం కోసం స్థానిక రెవెన్యూ అధికారుల నుండి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్,జిల్లా కలెక్టర్, ధవళేశ్వరం ఆర్ అండ్ ఆర్ కార్యాలయం చుట్టూ గడిచిన పది సంవత్సరాల్లో ఎంతోమందికి దరఖా స్తులు పెట్టి అలసిపోయారే తప్ప నేటికీ వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నష్ట పరిహారం అందించే సమయంలో ఆదివాసీ భూముల్లో ఉన్న టేకు చెట్లకు, ఇతర చెట్లకు ఫారెస్ట్ అధికారులు ఎన్వోసీలు ఇవ్వకపోవడంతో నేటికీ ఆదివాసులకు వాటికి సంబంధించిన పరిహారం అందలేదని, కానీ నాన్ ట్రైబల్స్‌కు మాత్రం ఫారెస్ట్ అధికారులు ఎలా ఎన్ఓసిలు ఇచ్చారో చెప్పాలన్నారు. మరోపక్క ఎల్‌టిఆర్‌పి కేసులు కొనసాగుతున్నా, వాటికి ఎటువంటి జడ్జిమెంట్ లేకపోయినా పోలవరం ప్యాకేజీ నాన్ ట్రైబల్స్‌కి జారీ చేశారని, ఇది ఎలా సాధ్యమో అర్థం కావట్లేదని ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తంచేసారు. దేవీపట్నం మండలంలో కోట్ల రూపాయలు దండుకున్న నాన్ ట్రైబల్స్ చిట్టా, వారికి సహకరించిన అధికారుల చిట్టా పూర్తి ఆధారాలతో తమ వద్ద ఉన్నాయని, ప్రభుత్వం వెంటనే దీనిపై సిబిసిఐడితో దర్యాప్తు జరిపి ప్యాకేజీ పేరుతో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న నాన్ ట్రైబల్స్, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులైన ఆదివాసులకు న్యాయం జరిగే విధంగా స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కృషి చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆదివాసులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకో వాలని ఆయన కోరారు. అంతేకాక తప్పుడు మార్గంలో ప్రభుత్వాన్ని మోసం చేసి నాన్ ట్రైబల్స్ ఇప్పటివరకు దండుకున్న ప్రభుత్వ ధనాన్ని రికవరీ చేయాలని, అలాగే కొత్తగా ప్యాకేజీ ఇవ్వాల్సిన నాన్ ట్రైబల్స్ ఉంటే వారికి నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు, డివిజన్ కోఆర్డినేటర్ పీతా ప్రసాద్, నాయకులు యాలగడ నాగేశ్వరరావు, నిర్వాసితులు ముర్ల నాగమణి, పెద్దిరెడ్డి, జీడి పోచివేని, కోసు సోమన్న ధర, తాటి రామన్న దొర, సూరన్న దొర, వీరభద్ర రెడ్డి, కొమరం లచ్చన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలపై కమీషనర్‌కు సిపిఎం వినతి

**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం పట్టణంలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం పెద్దాపురం సిపిఎం కమిటి ఆధ్వర్యంలో మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద నుండి ప్రజలను కాపాడాలని, అలాగే పిచ్చి మొక్కలు పేరుకుపోయాయని, రైతు బజార్ దగ్గర ఉన్న నెం.1 స్కూల్ వద్ద డంపింగ్ యార్డ్‌గా తయారైందని, గత మీసేవ కేంద్రంను వినియోగంలోకి తీసుకురావాలని, పారిశుధ్య పనులు మెరుగుపరచాలని, శ్మశాన వాటికలలో పిచ్చిమొక్కలు తొలగించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అప్పన్న, రమేష్, కృష్ణ, శ్రీను, నరసింహమూర్తి, రమణ, తదితరులు పాల్గొన్నారు.



# నేడే జాతీయ లోక్ అదాలత్

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 42 బెంచ్ లలో సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి గంధం సునీత గారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, చెక్ బౌన్స్, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు తదితర కేసులు పరిష్కరించుకోవచ్చని తెలియ చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గారి ఆదేశాల మేరకు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, డా బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పు గోదావరి జిల్లా, ఏ ఎస్ ఆర్ జిల్లా రంపచోడవరం డివిజన్ లో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందనీ తెలిపారు.

# రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షులుగా ముప్పన కేశవ్

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవొమ్మంగి సొసైటీ అధ్యక్షులుగా ముప్పన డింబకేశ్వరరావు ( కేశవ్ )ను నియమిస్తూ గురువారం రాత్రి అధికారికఉత్తర్వులు వచ్చాయి. అలానే సొసైటీ డైరెక్టర్లుగామద్దేసు గంగయ్య, విషం శెట్టి చిట్టెమ్మను నియమించడం జరిగింది. కేశవ్ తమ సోదరులతో కలిసిఅధికార వైసిపిపార్టీ నుండి టిడిపిలోకి వచ్చి మండలంలోని టిడిపి బలోపేతానికి తమ వంతు కృషి చేయడం జరిగింది. అలానే క్లస్టర్ ఇన్చార్జ్‌గా బాధ్యతలు చేపట్టి బూత్ ఇన్చార్జిల పనితీరు మెరుగుపరచడం, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించడంలో ప్రతిభ కనపరచడం, కార్యకర్తలను సమన్వయ పరచడం జరిగింది. ఇలాంటి ఎన్నో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం, ప్రతి పక్షంలో ఉన్నప్పుడు విమర్శలను తిప్పు కొట్టడంలో కేశవ్ పేరు అధిష్టం దృష్టిలోకి వెళ్లడం జరిగింది. టిడిపి సీనియర్ నాయకులు దంతలూరి శివరామచంద్ర రాజు, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లోతా లక్ష్మణరావు, షేక్ బాబ్జి, మోహన్ కుమార్, సావిత్రి, జెట్టిమధు, అద్దే పల్లి చిన్నారావు, చెక్క లోవ రాజు, రాజుతదితరులు కేశవ్‌ను అభినందించారు. ఎమ్మెల్యే శిరీష భాస్కర్, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ భాస్కర్ కు కేశవ్ కృతజ్ఞతలు తెలిపారు. తన పని తీరు పట్ల సంతృప్తి చెంది తమ పేరు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లిఈ బాధ్యత అప్పగించినందుకు శిరీష భాస్కర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలానేరాజవొమ్మంగి ప్రాథమిక సహకార సంఘం( సొసైటీ)ను మరింత అభివృద్ధి పదంలో నడిపించడానికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని, ఎల్ల వేలలో రైతులకు అందుబాటులో ఉంటానని నూతనంగా సొసైటీ అధ్యక్షులుగా నియమించబడిన ముప్పన కేశవ్ సూర్యకు తెలిపారు.



## బీసీల ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని వినతి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** బీసీలకు ఆయా ప్రభుత్వాలు ఇచ్చిన ప్రధానమైన ఐదు హామీలను నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ నేతృత్వంలో వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి రామ్మోహన్రావుకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుత్తుల రమణ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ 34% అమలు చేయాలని అలాగే బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. భారతీయ మనువాద సమాజంలో అనాదిగా సామాజిక అణిచివేతకు, ఆర్థిక దోపిడీకి గురై అన్ని విధాల వెనక్కు నెట్టబడ్డ 139 బీసీ కులాలను ఆదుకోవాలని చెప్పారు. రజక, నాయి బ్రాహ్మణ వంట కులవృత్తులు, కుమ్మరి, కమ్మరి, గీత, నేత, చేనేత వంటి సామాజిక వృత్తులను బీసీలు చేస్తున్నారన్నారు. పెత్తందారీ వర్గాలు వారిని కులం, వృత్తి పేరుతో హేళంగా పిలుస్తున్నారు. అందువల్ల రక్షణ చట్టం అమలు చేస్తే చాలా వరకు వారిపై అవమానకరమైన వ్యాఖ్యలు తగ్గుతాయన్నారు. జనాభా దామాషా మేరకు బీసీలలో రిజర్వేషన్ 33 శాతం కల్పిస్తామంటూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసిందని ఆ తరహాలోనే వారికి రిజర్వేషన్ కల్పించాలని చెప్పారు. 33 శాతం చట్టసభల్లోనూ, 34 శాతం స్థానిక సంస్థల్లోనూ రిజర్వేషన్ చేస్తామని శాసనసభలో నిర్మాణం చేసి కేంద్రాన్ని పంపాలని రమణ రమణ చెప్పారు. కేంద్రంలో ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖ నియమించి సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి ఆ మేరకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి నోడల్ ఏజెన్సీల ద్వారా సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనివల్ల బీసీలకు ఆర్థిక పరిస్థితి మెరుగై వారి సాధికారికతకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే రాజధానిలో మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే స్మృతివనం ఏర్పాటు చేసి బీసీల ఆత్మగౌరవాన్ని పెంచాలని రమణ సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు బడే కృష్ణ, వంకా మాలతి, ఎం మోనా, వి దుర్గా మంగతాయారు, బత్తుల భవాని, మన్నే నాగేశ్వరరావు, డివివి కుమారస్వామ, పెండ్యాల ఏసుబాబు, పరిమి శ్రీనివాస్, మల్లిపూడి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## తొలగించిన కార్మికులను విధులలోకి వెంటనే తీసుకోవాలి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** బ్లూఓషన్ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులను తక్షణం విధులలోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. తొలగించిన 78మంది కార్మికులతో శుక్రవారం యాసలపు సూర్యారావు భవనంలో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ బ్లూఓషన్ కంపెనీ కార్మికులకు కనీస ముందస్తు నోటిస్ లేకుండా గేటు మందు ఆపివేయడం దుర్మార్గ చర్య అని, లే అఫ్ ప్రకటించడం, అన్యాయమని ఇది కార్మికుల పొట్ట కొట్టడమే అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం తొలగించిన కార్మికులను వెంటనే విధులలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా ఆర్డీఓ కార్యాలయంలో కార్మికులతో కలసి ఏఓ మాధవ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు శ్రీను, సూరిబాబు, కార్మికులు కె.సత్యనారాయణ, దుర్గా ప్రసాద్, లోకేష్, త్రినాధ్, వై.సాయికుమార్, రాజేష్, పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టి కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోంది

**– ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వంలో నిరంతరం కృషి చేస్తున్నారని ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్య ప్రభ అన్నారు. శుక్రవారం కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్, మత్స్యశాఖ అధికారులతో కలిసి ఏలేరు జలాశయంలో పది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్య ప్రభ మాట్లాడుతూ చేప పిల్లల విడుదల ద్వారా స్థానిక మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడం, వారికి స్థిరమైన ఆదాయ మార్గాలను అందించడం, వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. జలాశయంలో చేపల పెంపకం ద్వారా ఏలేరు పరిసర గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మత్స్యకార కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పూర్తిగా కట్టుబడి ఉంది. ఆధునిక పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, సబ్సిడీ నిధులు అందించి వారి జీవితం మరింత సుస్థిరంగా మారేలా కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను మత్స్యకారులు సక్రమంగా వినియోగించుకుని లబ్ది పొందాలన్నారు. ప్రతి మత్స్యకారుడు వారి కుటుంబం ప్రగతి పథంలో నడవాలని, జీవితం సంతోషంగా, సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షిస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు.

ఈ కార్యక్రమానికి మత్స్య శాఖ ఏడి కృష్ణారావు, ఏలూరు ప్రాజెక్టు అభివృద్ధి కమిటీ చైర్మన్ బసవ వీరబాబు, దేశం పార్టీ నాయకులు బొద్దిరెడ్డి గోపాలకృష్ణ, మాజీ జెడ్పిటిసి సభ్యులు జ్యోతుల పెదబాబు స్థానిక ప్రజలు, మత్స్యకారులు ఎన్డీఏ కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఎంపీడీవోకు వినతి పత్రం



**పెరవలి, మేజర్ న్యూస్ :** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 11వ తేదీ గురువారం పెరవలి మండలానికి సంబంధించిన సచివాలయం ఉద్యోగులు పెరవలి ఎంపీడీవో కేయుఆర్ పద్మజకు వినతిపత్రం అందించారు. తమ సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పెరవలి మండలం ఎంపీడీవో పద్మజకు తెలియజేశారు. ఈ సందర్భంగా పెరవలి మండల గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం,క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురికావడంతో పాటు ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుందనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీడీవోను కోరారు. ఇంటింటికీ తిరిగే పనుల నుంచి విముక్తి కల్పించాలని, ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అన్ని విభాగాల వారీ ప్రమోషన్స్ ఛానెల్స్ ఏర్పాటుతోపాటు జిల్లాల వారీ సీనియారిటీ జాబితా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు.విద్యార్హతల ఆధారంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించేలా అవకాశాలు కల్పించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెరవలి మండల గ్రామ సచివాలయ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోతుల మోహన్ రావుని ఘనంగా సన్మానించిన వెలమ సంఘం



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** సింగంపాలెం గ్రామంలో గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోతుల మోహనరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన సందర్భంగా గండేపల్లి గ్రామ వెలమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పోతుల మోహన్ రావు స్వగ్రామం సింగం పాలెంలో ఆయన స్వగృహం నందు మోహన్ రావును దుస్సాలువా కప్పి మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్లం రెడ్డి రామకృష్ణ, గండేపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కంటిపూడి సత్యనారాయణ, సింగరంపాలెం, గండేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదిత్య డిగ్రీ కళాశాల మేనేజ్మెంట్ అధ్యాపకులు ఎస్ కృష్ణ బాబుకు డాక్టరేట్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల( స్వయం ప్రతిపత్తి) మేనేజ్మెంట్ డీన్ కృష్ణ బాబు సాంబారు కు ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ లోని డిపార్టమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ నుండి డాక్టరేట్ వచ్చినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలియజేశారు.

ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల మేనేజ్మెంట్ డీన్ సాంబారు కృష్ణ బాబుకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ లభించింది. నన్నయ యూనివర్సిటీ డిపార్టమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగాధిపతి ఆచార్య ఎన్.ఉదయ్ భాస్కర్ నేతృత్వంలో ఎస్ కృష్ణ బాబు చేసిన "ఇంపాక్ట్ ఆఫ్ సోషల్ మీడియా మార్కెటింగ్ ఆన్ పర్చేజ్ ఇంటెన్షన్ ఇన్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్ గూడ్స్ విత్ రెఫరెన్స్ టు స్మార్ట్ సిటీస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అనే పరిశోధనా అంశానికి డాక్టరేట్ డిగ్రీ వచ్చినట్లు తెలియజేశారు.ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ చేతుల మీదుగా కృష్ణబాబు పిహెచ్.డి. అవార్డు అందుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి. స్వామి, ప్రిన్సిపల్ ఆచార్య డి జ్యోతిర్మయి, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ డీన్ డా. పి.విజయనిర్మల, గైడ్ ఆచార్య ఎన్ ఉదయభాస్కర్ మరియు విభాగ అధ్యాపకులు కృష్ణబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కృష్ణబాబు మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని డైరెక్టర్ డాక్టర్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ కృష్ణ బాబును ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి , ప్రిన్సిపాల్ మహమ్మద్ షాహిద్దీన్, అధ్యాపకులు అభినందించారు.

# రాజవొమ్మంగి సబ్ ఇన్స్పెక్టర్‌గా టి.శివకుమార్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రాజవొమ్మంగి సబ్ ఇన్స్పెక్టర్ గాటి శివ కుమార్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని డొంకరాయి సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎస్ఐ గావిధులు నిర్వహించిన ఎల్ నరసింహమూర్తి బదిలీ పై గుర్తేడు వెళ్లారు.కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ కు చెందిన శివకుమార్ 2012 బ్యాచ్ కు చెందిన వారు. స్టేషన్ పరిధిలో పేకాట,గుండాట, చిత్తులాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్ప డిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సారాయి తయారు చేయడం, విక్రయించడం, గంజాయి పండించడం, ట్రాన్స్పోర్ట్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు అన్నారు. నూతన ఎస్ఐ గా బాధ్యతలు నిర్వహించిన శివకుమార్ ను స్థానిక సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలు అందజేసి అభినందించారు.

# మండలంలో సుడిగాలి పర్యటన చేసిన తహశీల్దార్



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్:** పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ జిల్లా అధికారుల సూచనల మేరకు మండల ంలోని పలు గ్రామాలలో సచివాలయాలును శుక్రవారం పరిశీలించడం జరిగింది. దీనిలో భాగంగా ఆనూరు, కొండపల్లి, వాలుతిమ్మాపురం, ఆర్.బి.పట్నం, ఆర్.బి.కొత్తూరు, చినబ్రహ్మదేవం, పెద్దాపురం పట్టణంలోని పలు సచివాలయాలను తనిఖీ చేసి వీఆర్వోలకు పలు సూచనలు జారీ చేశారు. సచివాలయాలలో వీఆర్వోలు నిర్వహిస్తున్న విధులు, ఇండ్ల స్థలాల ధరఖాస్తుల పరిశీలన, సుమోటో కులధృవీకరణ పత్రాల ప్రగతి, పలు రెవెన్యూ అంశాలను పరిశీలించారు. ఆమె వెంట వీఆర్వోలు వెంకటేశ్వరరావు, సునీత, పలువురు వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# కానూరు హైస్కూల్లో ఉపాధ్యాయినీలకు ఐరన్

**– ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు పంపిణీ**



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు హైస్కూల్‌లో సెప్టెంబర్ 12వ తేదీ శుక్రవారం మహిళా ఉపాధ్యాయులకు ఐరన్–ఫోలిక్ యాసిడ్ (ఐఎఫ్ఎ) టాబ్లెట్స్ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మహిళా ఉపాధ్యాయులకు ఐరన్ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రక్తహీనత నివారణ కోసం ఈ ఐఎఫ్ఏ టాబ్లెట్స్ పంపిణీ చేయడం జరుగుతోంది. మహిళా ఉపాధ్యాయులు ఆరోగ్యంగా, బలంగా ఉండి విద్యాబోధనలో మరింత ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సిహెచ్ఓ కె .జయమణి మాట్లాడుతూ రక్తహీనత వల్ల కలిగే సమస్యలను వివరించారు.

టాబ్లెట్స్ క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గి కొత్త రక్తం పడుతుందని దాంతోపాటు శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావన మధు పూర్ణచందు, సిహెచ్ఓ కె.జయమణి, ప్రధానోపాధ్యాయు రాలుశ్రీ దమయంతి, ఉపాధ్యాయులు, ఏఎన్ఎం,ఎమ్మెల్ హెచ్ పి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరుకున్న ప్రధాన రహదారిని నిర్మించాలంటూ నడిరోడ్డుపై రాస్తారోకో, వంటావార్పు




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం పరిధిలో గల రమణయ్యపేట నుండి అన్నవరం వరకు గల 11 కిలోమీటర్ల ఏజెన్సీ గిరిజన గ్రామాలు అన్నింటికీ ఏలేశ్వరం చేర్చే ఏకైక రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని పెద్ద పెద్ద గోతులతో నిండిపోయి నరకానికి ద్వారములా తయారై, దశాబ్ద కాలం గడిచినప్పటికీ, ఈ రోడ్డు పునర్ నిర్మాణం చేపట్టకపోవడంతో అనేక మంది సామాజిక బాధ్యతతో ధర్నాలు రాస్తారోకోలు చేసినప్పటికీ ఉపయోగం ఉండకపోవడం శోచనీయం. దీంతో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు
లోదొడ్డి సర్పంచ్ లోతా రామారావు, ఎస్ ఎఫ్ ఐ, సిపిఎం ఆధ్వర్యంలో, అడ్డతీగల మండలం, గొంటువానీ పాలెం గ్రామం వద్ద, రోడ్డుపై టెంట్ వేసి, వంట వార్పు కార్యక్రమం చేపట్టి రోడ్డుపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏలేశ్వరం నుండి జే అన్నవరం మధ్య రహదారి ఎన్నో ఏళ్ల నుండి అధ్వానంగా ఉండడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. ఏలేశ్వరం మండలం పరిధిలో గల రమణయ్యపేట గిరిజన ప్రాంతం నుండి జే అన్నవరం వరకు 11 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి, ఎన్నో ఏళ్ల నుండి గిరిజనులు పడుతున్నక కష్టాలు కష్టాలు గానే మిగిలిపోయాయని వారు వాపోయారు. ఎన్నికలలో ఓట్ల కోసం వచ్చిన ప్రతి రాజకీయ నాయకుడిని గిరిజనులు నిలదీయడం, రోడ్డు పునర్నిర్మాణం చేస్తామని నాయకులు హామీ ఇవ్వడం తప్ప, నిర్మించే నాథుడు లేడు అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డతీగల, రాజవొమ్మంగి , వై రామవరం , కేడీపేట గిరిజన గ్రామాలకు ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు, పెద్దపెద్ద గుంతలు పడి, పూర్తిగా చిద్రమయిపోయి ఉండడంతో,ఆటోలో ప్రయాణిస్తున్న గర్భిణీ స్త్రీలు డెలివరీ అయిన సందర్భాలెన్నో. ఎన్నికల ముందు రమణయ్యపేట నుండి జె అన్నవరం వరకు గల రోడ్డు ను నిర్మిస్తానని, చెప్పిన హామీలు గుర్తుంచుకొని, ఇప్పటికైనా పాలకులు నెరవేర్చాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆర్డీఓ కార్యాలయానికి చేరుకున్న స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్:** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయానికి డివిజన్ పరిధిలో గల 11 మండలాలలో 476 రేషన్ షాపులకు సంబంధించి స్మార్ట్ ఈ-పోస్ యంత్రాలు రావడం జరిగింది.

వీటిని త్వరలో చౌకధరల దుకాణాల డీలర్లకు అందజేయనున్నట్లు ఆర్డీఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## మరిడమ్మ అమ్మవార్కి బంగారు, వెండి పుష్పాలతో పుష్పార్చన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవారిని బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో ఆసాదులు, వేదపారాయణదారులు, పూజ, అర్చన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పులిహోర ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి కమ్యూనిస్టు యోధుడు 'సీతారాం ఏచూరి'




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** సిపిఎం అఖిల భారత కార్యదర్శిగా పనిచేసి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పనిచేసిన ప్రజా పోరాట యోధులు, కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభశుక్రవారం పెద్దాపురం పట్టణంలోని యాసలపు సూర్యారావు భవనంలో సిరపురపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. దీనిలో భాగంగా సిపిఎం సీనియర్ నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు, డి.సత్యనారాయణ, డి.కృష్ణ, కూనిరెడ్డి అప్పన్న, మరిడయ్య, రమేష్, నరసింహమూర్తి, వీర్రాజు, సుబ్బలక్ష్మీ, నరసింహమూర్తి, లక్ష్మీ, సూర్యనారాయణ, భాస్కరరావు, గునూరు రమణ, నీలం శ్రీను, వడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సర్వరాయ షుగర్స్ బాటిలింగ్ యూనిట్ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపు

- మంచి అగ్రిమెంట్ చేస్తాం
- కార్మికులకు ధన్యవాదములు
- ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు



**కేశవరం, మేజర్ న్యూస్ :** శ్రీ సర్వరాయ షుగర్స్ బాటిలింగ్ యూనిట్‌లో మెజారిటీ గుర్తింపు ఎన్నికల కోసం జరిగిన ఎన్నికల్లో సోదర కార్మిక సంఘం సిఐటియు పై ఏఐటీయూసీ పావురం గుర్తు గెలుపొందింది. దీంతో ఏఐటీయూసీ కార్మికులు పెద్ద ఎత్తున ఫ్యాక్టరీ ఎదుట జువ్వలు కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ పోటీ సంఘం మాపై అనేక తప్పుడు ఆరోపణలు అవాకులు చెవాకులు మాట్లాడిన కార్మికలోకం ఏఐటీయూసీ నాయకత్వం యూనియన్ అధ్యక్షులు గారపాటి రామారావు పై నమ్మకం ఉంచి పావురం గుర్తుపై ఓటు వేచి గెలిపించందండుకు కార్మిక సోదరీ సోదరులకు ధన్యవాదాలు తెలిపారు. అధ్యక్షులు జి రామారావు మాట్లాడుతూ మంచి వేతన అగ్రిమెంట్ చేస్తానని ఏఐటీయూసీ మధు గారు కార్మికుల సమస్యలను పరిష్కార చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా ఫోరం జిల్లా కన్వీనర్ పి లావణ్య, యూనియన్ కార్యదర్శి దున్నే రాంబాబు, పితాని శ్రీధర్, సింగంపల్లి మరిడయ్య, బండారు రాజు, విద్యార్థి యువజన నాయకులు చింతలపూడి సునీల్, పి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## హైవే దాబా వద్ద బంగారం చోరీ



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** తాళ్లూరు 16 నెంబర్ జాతీయ రహదారి దాబా హెూటల్ వద్ద 600 గ్రాముల బంగారం చోరీ అయినట్లు గండేపల్లి ఎఫ్ ఐ శివ నాగబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరుకు చెందిన అంబూరి మునిరాజు నెల్లూరు శ్రీ గోల్డ్ జువెలరీ షాపులందు పనిచేసు_్తన్నట్లు. తరచూ అతని ఓనర్ చెప్పిన ప్రకారం విజయనగరం విశాఖపట్నం ఏరియాలలో గోల్డ్ షాపులకు బంగారు వస్తువులు పట్టుకొని వెళుతున్నట్లు.

అదేవిధంగా రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి 1200 గ్రాముల బంగారు వస్తువులు పట్టుకొని వచ్చి విజయనగరం వైజాగ్‌లో సుమారు 600 గ్రాముల గోల్డ్ వస్తువులు షాపులకు ఇచ్చి, మిగిలిన 600 గ్రాముల గోల్డ్ వస్తువులతో ది. వి 10.09.2025 తేదీన నెల్లూరు వస్తుండగా తాళ్లూరు హనీ దాబా వద్దకు వచ్చేసరికి బస్సు డ్రైవర్ భోజనం నిమిత్తం ఆపగా ఫిర్యాదు అయిన మునిరాజు రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో బస్సు దిగి భోజనం చేసి మరలా తిరిగి చూసుకునేసరికి తన బ్యాగు మరియు బ్యాగ్‌లో ఉన్న 600 గ్రాముల బంగారు వస్తువులు (చెవి దిద్దులు మరియు గాజులు) కనిపించకుండా పోయినట్లు ఇచ్చిన రిపోర్టుపై గండేపల్లి పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం ఎస్ ఐ శివ నాగబాబు తెలిపారు.

# కరకుదురులో దుర్గాదేవి పందిరి రాట ముహూర్తం



**పెదపూడి, మేజర్ న్యూస్ :** కరకుదురు గ్రామంలో విజయదశమి సందర్భంగా శ్రీ దుర్గా దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ తోటకూర శ్రీను మాట్లాడుతూ ఈరోజు మా కరకుదురు గ్రామంలో దుర్గాదేవి పందిరిరాట ముహూర్తం చేయడం జరిగిందని, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు మా గ్రామస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు అని, మా గ్రామ నాయకులు పెద్దలు గ్రామస్తులు కూడా మాకు ఎంతో సపోర్టు చేస్తూ మా కమిటీకి వెన్నుదన్నుగా ఉంటున్నారని, ఏ పని వచ్చిన సరే మేమున్నామని చెప్పి మాకు చాలా సపోర్ట్ చేస్తున్నారని, ఈ దసరా మహెూత్సవాలలో మా వెనకాల ఉండి మా గ్రామస్తులు మా గ్రామ నాయకులు మాకు ఎంతో సపోర్ట్ చేస్తున్నారని, ఈ దుర్గాదేవి వెలిసినప్పుడు నుంచి కూడా మా గ్రామంలో పాడిపంటలతో ఆయురారోగ్యాలతో కూడా మా గ్రామం అంతా దినదిన అభివృద్ధి చెందుతుందని, అలాగే మా గ్రామంలో దుర్గాదేవి వెలసినప్పుడుటు నుంచి కూడా ఎంతో సుభిక్షంతో మా గ్రామం ఉందని, గ్రామస్తులు అందరూ కూడా మాకు ఎంతో సహకరిస్తున్నారని, దేవి నవరాత్రుల్లో భాగంగా మాకు ఎంతో సహకరిస్తున్న మా గ్రామస్తులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామని, గ్రామస్తులందరూ కూడా మాకు ఎంతో సపోర్ట్ గా ఉండి వెన్నుదన్నుగా నిలిస్తున్నారని, మా గ్రామస్తులందరూ కూడా ఇలాగే మాకు సపోర్ట్ ఇవ్వాలని, మా దుర్గాదేవి గుడికి ఇంకా మా గ్రామస్తులు మా గ్రామ నాయకులు సపోర్ట్ ఇవ్వాలని, ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికి గ్రామస్తులు కి గ్రామ నాయకులకి గ్రామ పెద్దలకి ధన్యవాదములు తెలియజేస్తున్నామని, ఆలయ కమిటీ చైర్మన్ తోటకూర శ్రీను అన్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అడబాల బుజ్జి, పెద్దిరెడ్డి సాయిబాబు, సానా రాజు, కంచి మూర్తి రాంబాబు, అడపా శ్రీను, పులి కేశవ ప్రసాద్, అల్లం బుజ్జి, మద్దూరి ఆదినారాయణ, పెమ్మనబోయిన వీరబాబు, పేపకాయల ముసలయ్య, అడపా రాము,అధిక సంఖ్యలో భక్తులు గ్రామస్తులు, గ్రామ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# టిడిపిలో చేరిన సంజీవి ఫిషర్ మాన్ కోపరేటివ్ సొసైటీ సంఘ సభ్యులు

**– పార్టీ కండువాలతో సాదర స్వాగతం పలికిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట సంజీవి ఫిషర్ మాన్ కో-ఆపరేటివ్ సొసైటీ సంఘం సభ్యులు కడితి లాజర్ ఆధ్వర్యంలో సుమారు 26 కుటుంబాలు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే నెహ్రూ పార్టీ కండువాలు వేసి సాధారంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాజర్ మాట్లాడుతూ గతంలో 75 మంది ఈ సొసైటీలో సభ్యులుగా ఉండే వారిమని కాలాంతరం 26 మంది సభ్యులు మాత్రమే ఉన్నామని మాకు అనేక ఇబ్బందులు పడటంతో సమర్థవంతమైన నాయకుడు జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో పనిచేయడానికి ఈరోజు తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నామని 15వ తేదీన జరిగే ఫిషర్ మ్యాన్ ఎన్నికలకు ప్రెసిడెంట్ కడితి పైడియా , వైస్ ప్రెసిడెంట్ కడితి ప్రసాద్, సెక్రెటరీ కందరాడచంద్రరావు, సభ్యులుగా సలాది రాజబాబు, మురారి బుజ్జిబాబు, సంకు మల్ల రమణ, సలాది చిన్న కాటయ్య, మర్లప్రకాష్,మర్ల రాజబాబు తదితరులను ఎన్నుకునేందుకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై ఈరోజు సొసైటీ సభ్యులందరూ టిడిపిలో చేరుతున్నారని వారందరికీ స్వాగతం పలుకుతున్నామని అన్నారు.

తెలుగుదేశం పార్టీ 1983లో కూడు గుడ్డ నీడ నినాదంతో ఏర్పడిందని గత 40 సంవత్సరాలుగా ఎన్టీఆర్, చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలను ఆదుకున్నారని ఇటువంటి పార్టీలోకి మీరందరూ రావడం పార్టీకి మరింత ఫలం చేపడుతుందని మీ అందరికీ కావాల్సిన అన్ని రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి నేను కూడా సిద్ధమని ఆయన అన్నారు. సంఘ అభివృద్ధికి ఆదరణ పథకం ద్వారా మిమ్మల్ని ఆదుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు, బుర్రి సత్తిబాబు, పాంద్రంగి రాంబాబు, దేవరపల్లి మూర్తి, పీలామహేష్, రాయి సాయి, మారిశెట్టి రాధా, వేములకొండ జోగారావు, సాంబత్తుల చంద్రశేఖర్, తుమ్మల కిషోర్, గెద్దాడ సత్యవేణి, నండ్ల చిరంజీవి, కోంద్రోతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ నగర్ మహాశక్తి గణపతి ఆలయం వద్ద మహా అన్నసంతర్పణ



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** స్థానిక రమణయ్యపేట ఆంజనేయ నగర్ వద్ద శ్రీ మహాశక్తి గణపతి ఆలయం వద్ద గణపతి నవరాత్రులు పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త టిడిపి జిల్లా అధికార ప్రతినిధి దాయన రాంప్రసాద్ వారి సోదరుడు దాయన శ్రీనివాస్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో కాకినాడ రూరల్ జనసేన సీనియర్ నాయకులు సలాది శ్రీనివాస స్వామి శ్రీనివాస్ బాబు విచ్చేసి అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మకర్త దాయన రాంప్రసాద్ మాట్లాడుతూ ఈ శక్తి గణపతి ఆలయంలో ప్రతి ఏటా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నామని ఆఖరిరోజు నిమజ్జన కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఘనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సుమారు 3000 మందికి అవంతి నగర్, సాయి సురేష్ నగర్, మారుతి నగర్, కాలవ గట్టు, బాలాజీ నగర్, బాపన్న దొర కాలనీ నుండి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారని అన్నారు. అనంతరం సలాది శ్రీనివాస్‌తో మాట్లాడుతూ దాయన రాంప్రసాద్ ఈ గుడి నిర్మాణ విషయంలో ఆలయ అభివృద్ధిలో పెద్దన్న పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో గుడి ఆలయ కమిటీ యాళ్ల రాజు, భావిశెట్టి రామకృష్ణ,పాలిక శ్రీనివాస్, టెంట్ హౌస్ రాంబాబు, కోన సత్యనారాయణ, సుశీల స్వీట్స్ అధినేత వెంకటేష్, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**– ప్రజా దర్బార్ కార్యక్రమంలో బండారు సత్యానందరావు**




**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడానికి కృషి చేయాలని అధికారులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. ప్రజల ఆశలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికై అధికారులతో మాట్లాడి త్వరగా పరిష్కరించాలన్నారు.

# పుణ్యక్షేత్రంలో పక్షుల సంరక్షణ కేంద్రం

**– పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు**
**– రాజానగరం ఎమ్మెల్యే బత్తుల**



**రాజనగరం, మేజర్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం, రాజా నగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామంలో సందడి చేసే విదేశీ పక్షులను సంరక్షణకు, వీటిని చూడ్డానికి వచ్చే సందర్శకులకు సదుపాయాలతో పర్యాటక ఆకర్షణ కేంద్రంగా అభివృద్ధి చేస్తామని రాజానగరం శాసనసభ్యుడు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం పుణ్యక్షేత్రం గ్రామంలో అటవీశాఖ అధికారులు, ఇతర శాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో పక్షుల సంరక్షణ కేంద్రం ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, నాలుగు కోట్ల రూపాయలతో పుణ్యక్షేత్రం పక్షుల సంరక్షణ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. విదేశాల నుంచి వలసవచ్చే పక్షులను స్థానికులు తమ ఇంటి ఆడపడుచుల్లా ప్రేమగా చూసుకుంటున్నారని అన్నారు. దాదాపు 125 సంవత్సరాలుగా ఈ పక్షులు పుణ్యక్షేత్రం గ్రామానికి వస్తున్నాయని, గ్రామంలోని పెద్ద చెట్లపై గూళ్ళు కట్టి సుమారు ఆరు నెలలపాటు ఇక్కడే నివసిస్తూ గ్రామస్తులకు ఆహ్లాదాన్ని పంచుతాయని వివరించారు. పుణ్యక్షేత్రం ఊర చెరువును అభివృద్ధి చేసి, సందర్శకుల కోసం వాచ్ టవర్లు, చిల్డ్రన్ ప్లే జోన్లు, పక్షుల ఆవాసాల కోసం ప్రత్యేక నిర్మాణాలు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని ఎకో టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఆయన తెలిపారు. ఈ పక్షుల సంరక్షణ కేంద్రం కేవలం టూరిస్ట్‌లకే కాకుండా విద్యార్థులు, పరిశోధకులు, పక్షి ప్రేమికులకు కూడా ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాజమండ్రి జిల్లా అటవీ అధికారి వి. ప్రభాకరరావు, రాజమండ్రి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ డేవిడ్ రాజు, డిప్యూటీ రేంజర్ పద్మావతి దేవి, ఎమ్మార్వో జి.ఎ.ఎల్.ఎస్. దేవి, ఎంపిడివో ఝాన్సీ, ఈవోపిఆర్డీ, విద్యుత్ శాఖ అధికారులు, వెటర్నరీ వైద్యులు, ఆర్డబ్ల్యు ఎస్ అధికారులు, ఫిషరీస్ శాఖ అధికారులు, ఆరోగ్య శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్లీప్‌వెల్ దోమల ధూప కర్రలలో రసాయనాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇళ్లలో వినియోగించే పురుగు మందుల సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని హోం ఇన్సెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హికా) గౌరవ కార్యదర్శి జయంత్ దేశ్పాండే తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, విజయవాడ నుంచి సేకరించిన స్లీప్‌వెల్ దోమల వికర్షక ధూప కర్రల నమూనాలలో మెపఫ్లుత్రిన్ ఉందని ప్రయోగశాల పరీక్షలలో వెల్లడైందన్నారు. ఇది దోమల కోసం ఉపయోగించడానికి అధికారుల ఆమోదం లేని రసాయనం అన్నారు. స్లీప్వెల్ దోమల వికర్షక ధూపం కర్రలను ఆషికా ఇన్సెన్స్ ఇంక్ తయారు చేస్తుందన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల ముప్పు నిరంతరం పెరుగుతున్నందున, నివారణ చాలా కీలకమన్నారు. నకిలీ దోమల వికర్షక ధూపం కర్రలకు అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అవతరించాయన్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి, ప్రజలు ప్యాకేజింగ్ ముద్రించిన రిజిస్ట్రేషన్ నంబర్ (సీఐఆర్‌తో ప్రారంభమయ్యే) ఉన్న, ప్రభుత్వం ఆమోదించిన దోమల వికర్షకాలను మాత్రమే ఉపయోగించాలని కోరారు.

## 34 మంది పేకాట రాయుళ్లకు 10,200 రూపాయలు జరిమానా



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మరియు జగ్గంపేట పోలీస్ స్టేషన్లో వివిధ చోట్ల పేకాటలకు పాల్పడిన 34 మంది పేకాట రాయుళ్లను ను గౌరవ పెద్దాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు ముందు ప్రొడ్యూస్ ప్రొడ్యూస్ చేయగా ఒక్కొక్కరికి 300 రూపాయలు చొప్పునఫైన్ టోటల్ 10,200/- రూపాయలు జరిమానా విధించడం జరిగినది. అదే విద ముగా జగ్గంపేట గోపాల్ నగర్ కు చెందిన ఏ. మరిడియ 55 సంవత్సరంలు అను ఆసామికి 26 బాటిల్స్‌తో జనవరి 24లో ఎక్సైజ్ కేసు నమోదు చేయగా ఆ కేసులో 10,500 రూపాయలు జరిమానా విధించడం జరిగిందని ఒక ప్రకటనలో జగ్గంపేట సిఐ వై ఆర్ కే శ్రీనివాస్ తెలిపారు.

## గ్రామ స్థాయి బాలల సంక్షేమ, పరిరక్షణ కమిటీ సమావేశం



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ మరియు జగ్గంపేట ఐసీడీస్ ప్రాజెక్ట్ అధికారిణి మిరియాల పూర్ణిమ అధ్యక్షతన గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం నందు గ్రామ స్థాయి బాలల సంక్షేమ మరియు పరిరక్షణ కమిటీ అధికారులకు మండల స్థాయిలో బాలల పరిరక్షణ మరియు బాలల చట్టాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గండేపల్లి ఎంపీడీవో కర్రి హరికృష్ణ సత్య రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిర్మూలించ వలసిన బాధ్యత గ్రామ స్థాయి కమిటీ అధికారులందరికి ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి హెచ్ వెంకటరావు మాట్లాడుతూ బాలల హక్కులు మరియు రక్షణకు కృషి చేయాలన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరూ బాల్య వివాహాలను నిలుపుదల చేయడంలో ప్రతీ ఒక్కరి పైన ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ బి శ్రీనివాసరావు, ఏవో కర్రీ చంద్ర రావు, ఐసీడీస్ సూపర్ వైజర్లు నాగ పార్వతి, సునీత గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏయన్ యమ్‌లు, వార్డు మహిళ సంరక్షణ కార్య దర్శులు,స్కూల్ టీచర్స్, అంగన్వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

# పందిరిమామిడి - చవిటిదిబ్బలు రహదారి పూర్తి చేయాలి

**– నూతన ఐటీడీఏ పిఓకు ప్రజాప్రతినిధులు వినతి**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం మండలం పందిరిమామిడి నుండి వై. రామవరం మండలం కోట మీదుగా చవిటిదిబ్బలు వరకు రహదారి నిర్మాణం పూర్తి చేయడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని వై. రామవరం వైస్ ఎంపీపీ ఎం. జోగిరెడ్డి, పీసా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి. స్వామి రెడ్డి, పి. సంధ్యారాణి నూతన ఐటీడీఏ పిఓ ను కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. అటవీశాఖ అభ్యంతరం వల్ల ఈ రహదారి నిర్మాణం దశాబ్దాల కాలం నుండి పూర్తి కావడం లేదని, దీనివలన సుమారు 100 ఏజెన్సీ గ్రామాల ప్రజలు సరైన రహదారి, రవాణా సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారని గిరిజన ప్రజాప్రతినిధులు ఐటీడీఏ పిఓకు వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రధాన రహదారులు పూర్తి చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని రంపచోడవరం ఐటీడీఏ నూతన పిఓ స్మరణ్ రాజ్ వారికి హామీ ఇచ్చారు.

వేద మంత్రాల మధ్య బాధ్యతలు స్వీకారం పురోహితులు వేదమంత్రాల మధ్య రంపచోడవరం ఐటీడీఏ నూతన ప్రాజెక్టు అధికారిగా స్మరణ్ రాజ్ శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నూతన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి కార్యాలయంలో పివో చాంబర్‌లోకి రాగానే ఐటీడీఏ ఏపీవో జనరల్ డి ఎన్ వి రమణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పురోహితులు అద్దంకి వెంకటేశ్వరరావు, శశాంక్ శర్మ వేదమంత్రాలతో నూతన పిఓను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ నూతన ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని ఏడు మండలాల్లో గిరిజన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుండి మంజూరైన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగేలా చూస్తామన్నారు. సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు సక్రమంగా అందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతినెలా నిత్యావసర సరుకులు సమయంలో సరఫరా చేసే విధంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పీహెచ్ఓ దేవదానం, జిసిసి డివిజనల్ మేనేజర్ జయశ్రీ, ఏడిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ డేవిడ్, డిడి కార్యాలయ సూపర్డెంట్ బి.కిషోర్, ఈఈ ఐ.శ్రీనివాసరావు. డిఎల్‌డివో కే. కోటేశ్వరరావు, ఎంపీపీ శ్రీమతి బంధం శ్రీదేవి, జడ్పీటిసి పండా వెంకటలక్ష్మి, మాజీ శాసనసభ్యులు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎంపీటీసీలు తుర్రం వెంకటేశ్వరరావు, కుంజం వంశీ, ఉలవల లక్ష్మి, తహసిల్దార్లు కె.సత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాసరావు, బాలాజీ, దొరడియా, డిఈలు చైతన్య, నాగరాజు, గౌతమి నూతన ప్రాజెక్ట్ అధికారిని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

## శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హెూమం



**అన్నవరం, మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో క్షేత్ర పాలకురాలిగా విరాజిల్లుతున్న శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం సందర్భంగా ఘనంగా చండీ హెూమం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు శ్రీ వనదుర్గ అమ్మవారిని వివిధ రకముల పుష్పములతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వ్రత పురోహితులు అమ్మవారికి శ్రీ సూక్తం, పురుష సూక్తం, మూల మంత్రములు, నవగ్రహ అర్చన నిర్వహించి, 11 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హెూమం నిర్వహించిన భక్తులకు వేద పండితులు వేద ఆశీర్వచనం గావించగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అర్చకులు, వ్రత పురోహితులు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, భక్తులు గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దు

**– టిడిపి శ్రేణులు గొల్లపూడి, గణజాల**

**– రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా పంపిణీ**







**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** రైతులు యూరియా కోసం ఆందోళ్లనచెందవద్దని మన మండలానికి సరిపడా యూరియాను మన ప్రభుత్వం అందజేస్తుందని టిడిపి నాయకులు గొల్లపూడి పెద్దిరాజు, గణజాల తాతారావులు అన్నారు. శుక్రవారం మండలం లోని జడ్డంగి, రాజవొమ్మంగి రైతు సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సబ్సిడీ పై అంద చేసిన యూరియాను రైతులకు స్థానిక నాయకులతో కలిసి వారు అందజేశారు. ఎకరాకు 60 కేజీలు యూరియాను మాత్రమే వాడాలని ఒక్కొక్క దఫా 20 కేజీలు చొప్పున మూడు సార్లువరి చేలో యూరియానుచల్లాలని మండల వ్యవసాయ అధికారి చక్రధర్ అన్నారు. జడ్డంగి ఎస్సై చినబాబు, జట్టు మధు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు భరద్వాజ్, సాయి, శ్రీను, నవీన్ రైతులు, కూటమి నాయకులు ఉన్నారు.

## శేఖర్ మాస్టర్‌కి అభినందనల వెల్లువ

**– ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కారం**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాడు హై స్కూల్ నందు అదనపు తరగతి గదులు శుక్రవారం ప్రారంభోత్సవం చేసిన కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందంగారు ఇటీవల సర్వేపల్లి రాధాకృషన్ ఇన్స్పిరేషన్ అవార్డ్ అందుకున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కె.వి. శేఖర్ మాస్టార్‌ని దుశ్శాలువ కప్పి పూలమాలతో గ్రామం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అవార్డ్‌తో పాఠశాలకు, గ్రామానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాస్, కె.వి.వి.సత్యనారాయణ, సర్పంచ్ మట్టా సత్యదేవి బాబ్జి, పెచ్చుటి చిన్నారవు, మండల విద్యాశాఖ బి.శ్రీనివాస్ రాజు, స్కూల్ కమిటీ చైర్మన్ గెడ్డం త్రిమూర్తులు, నెక్కంటి వెంకన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కానూరు పశు వైద్యశాల వద్ద ఉచిత వైద్య శిబిరం



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు పశువైద్యశాల నందు సెప్టెంబర్ 12వ తేదీ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మరియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కానూరు గ్రామ సర్పంచ్ భావన మధు పూర్ణ చందు నడిపల్లి గ్రామ సర్పంచ్ బీర సత్యవేణి రాజులు ప్రారంభించారు. వ్యాక్సినేషన్ శిబిరాన్ని కానూరు పిఎసిఎస్ అధ్యక్షులు వాకల పూడి వీర్రాజు, కోలా సీతయ్య నాయుడులు ప్రారంభించారు. ఈ శిబిరానికి హాజరైన పశు యజమానులకు మేతను కానూరు తెదేపా పార్టీ అధ్యక్షుడు ముల్లపూడి రాజేంద్రప్రసాద్ కొవ్వూరు డివిజనల్ డిడి ఎస్ సత్యనారాయణ వెంకట్ రెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ ఎడి డాక్టర్ రిషి ప్రసాద్ పెరవలి పశు వైద్యాధికారులు డాక్టర్ వానపల్లి చరణ్ ఫణీంద్ర, డాక్టర్ సల్మా మరియు వెటర్నరీ అసిస్టెంట్‌లు బిహెచ్ రమేష్, పి.వనిత, వై.బి.యన్ కుమారి, మండలంలోని వెటర్నరీ అసిస్టెంట్లు అందరూ పాల్గొన్నారు.

## గండేపల్లి నూతన ఎంపీడీవోగా కర్రీ హరికృష్ణ సత్యా రెడ్డి బాధ్యతలు స్వీకరించి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వక కలయిక



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా బదిలీపై వచ్చిన కర్రీ హరికృష్ణ సత్యారెడ్డి బాధ్యత స్వీకరించి జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటివరకు ఇన్చార్జి ఎంపీడీవోగా పనిచేసిన కర్రీ చంద్ర రావు నూతన ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా హరికృష్ణ సత్యారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ సహకారంతో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందించే విధంగా పనిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కర్రి చందర్రావు, ఈవోపీఆర్డి ఐ ఎన్ శ్రీనివాస్, జెడ్ రాగంపేట సెక్రెటరీ తరంగిణి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు 21వ ప్రజాదర్బార్





**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం దిశగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు శుక్రవారం తమ కార్యాలయంలో 21వ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా 23 వినతులు స్వీకరించగా, అందులో 5 సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగతావి సంబంధిత అధికారులకు పంపి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ "ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించే వేదికగా ఎంపీ సానా సతీష్ బాబు గారి ప్రజాదర్బార్ పై జిల్లావ్యాప్తంగా నమ్మకం పెరిగిందన్నారు. అందుకే దూరప్రాంతాల ప్రజలు కూడా తరలివచ్చి వినతులు ఇస్తున్నారని ఆయన అన్నారు. కార్యాలయ ఇంచార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతులను శ్రద్ధగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. నేపాల్‌లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ పర్యాటకులను సురక్షితంగా వెనక్కి రప్పించడంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో ఢిల్లీలోని ఆంధ్రభవన్ నుండి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు సమన్వయం చేసి, విశాఖపట్నం, శ్రీకాకుళం, తిరుపతి ప్రాంతాలకు చెందిన వారిని స్వదేశానికి చేర్చారు. ఇందుకు కృతజ్ఞతలు తెలుపుతూ బాధితులు మంత్రి నారా లోకేష్, ఎంపీ సానా సతీష్ బాబుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పి.ఏ. గౌరీశంకర్, బిఆర్‌యుసిసి సభ్యులు ముత్యాల అనిల్, బళ్ళ శ్రీనివాస్, జున్నూరు బాబ్జి, సిరియాల కొండబాబు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.